
మంథా
వెంకట రమణా రావు



# ప్రేమనవలలు రాస్తారా?.... ఇవిగో చిట్కాలు

**"ధీరజుకి** ప్రణతి మీద నుండేది నిజంగా పవిత్రమైన ప్రేమభావమేనా?" అన్న ప్రశ్న పాటకుల మీదకి విసరబడింది, నవల వెనకట్ట మీద పెద్ద పెద్ద అక్షరాలతో ముద్రించబడి! "ఏమో మాకేం తెలుసు?" అని వారనుకొనే లోపన, ఆ క్రిందే మరో అకోటా ప్రశ్న! "ప్రేమే ఐతే, అది ప్రియురాలిమీద ప్రియుడికుండే విశృంఖలమైన, తీవ్రమైన ప్రేమా లేక తన ప్రాణ స్నేహితుడి చెల్లెలు కనక సోదర ప్రేమా?"

ఈ సరికి పాటకులకి "దీని భావమేమి తిరుమలేశా!? అనిపించకమానదు. నవలని అటునించిటు తిప్పకా మానరు. కవరట్ట టైటిల్ పేజి మీద ఈ రెండు సమస్యలకీ క్లూ దొరుకుతుంది! "వారిద్దరి మధ్యా ఏర్పడ్డ ఈ దుర్గమ దూరాన్ని దీరజు ఒక్క అంగలో దాటేసి ఎలా విజయం చేపట్టాడో చదవండి!" అని దీరజు, ప్రణతుల కవరట్ట బాపూ బొమ్మకింద ముద్రించి ఉంది.

ఈ "దుర్గమ దూరం" ఏమిటో, దీరజు ఒక్క అంగలో ఎలా దాటేసేడో తెలుసుకోవాలన్న ఉత్సుకత రేగిన పాటకులు ఈ ఘాటు ప్రేమ నవలని చదవక చస్తారా!? చదవకపోతే పజిల్ సాల్వ్ కాక తిండీ సహించదూ, నిద్రా పట్టదూ కదా!

ఈ ప్రేమపాకం ఎవరు తీసినట్టు? నవల టైటిల్ కన్న రచయిత్రి పేరే ప్రముఖంగా ఉంది అట్ట మీద! మీ అభిమాన రచయిత్రి పుచ్చకాయల ప్రేమకుమారి కలం నుండి వెలువడిన మాస్టర్ పీస్, "నగాలు నవ్వేయి!" మరెక్కడ్నించీ వెలువడలేదూ, ఆమె కలం నించే వెలువడినట్టు ప్రత్యేకంగా ప్రకాశకులు చెప్పడం వల్ల, ఆమె కలానికుండే, నవలల్ని కొనే మహత్యం గురించి పాటకులు అబ్బుర పడుదురు!


ఈమె పుట్టు పూర్వోత్తరా లేమిటి? ఈమెకు రాయాలన్న కోరిక ఎలా కలిగింది? స్వతస్సిద్ధమా లేక అలవరచుకున్నదా? ఆమె పత్రికల కిచ్చిన ఇంటర్వ్యూల ద్వారా మనకు తెలిసిందల్లా ఆమెకు ప్రేరణ కలిగించిందిఆమె తాతగారైన కీ. శే. తాటిపళ్ళ తాతారావు గారని — ముసలాడు చచ్చి నరకానున్నాడు కాని, బతికుంటే ఎన్నో ఇబ్బంది కలిగించే ప్రశ్న లెదుర్కొని ఉండును. అతగాడికి వేలిముద్ర వెయ్యడం తప్ప చదవడం, రాయడం చేతకాలేదు. జులాయిగా బతికి ఆస్తంతా హారతి పట్టేసేడు. ఆ సంగతి పాటకులకు తెలియదనుకోండి — వా రామె మాటనే నమ్మేరు!



'నగాలు నవ్వేయి!' అన్న ఈ బ్లాక్ బస్టర్ నవల ఈమె ఎలా రాయగలిగింది? దీని సక్సెస్ తరవాత ఆమె "మీ అభిమాన రచయిత్రి" కోవలోకి చేరుకుంది! ఆ ప్రశ్నకి జవాబు ఆమె ఇవ్వక దాట్ల వేసింది కాని, జవాబు తెల్సుకుందుకి అట్టే ప్రయాస పడ నవసరంలేదు.

ప్రేమా ఎండ్ ప్రేమా ప్రచురణ సంస్థ అచ్చువేసిన అమూల్యమైన గైడ్ బుక్, 'ప్రేమ నవలలు మీరూ రాయొచ్చు!' అవుత్సాహిక రచయితల నెందర్నో ప్రొఫెషనల్ రైటర్స్ కోవలోకి తీసుకు వెళ్ళిందంటే అతిశయోక్తి కాదు! ఆ పుస్తకం ఆమూలాగ్రం చదివినట్టయినా పుచ్చకాయల ప్రేమకుమారి మహా ప్రేమ నవలా రచయిత్రిగా ఎలా అవగలిగిందా అన్న ప్రశ్నకి జవాబు సులభంగా దొరుకుతుంది.

"ప్రేమ నవలలు వ్రాయండమ్మా! రాయండి!" అంటూ ప్రచురణకర్తలు, పత్రికలూ కాళ్ళావేళ్ళా పడుతూంటే, వారిమీద జాలిపడి ప్రేమకుమారి కలం పట్టడం, సమయానికి ఆమెకు 'ప్రేమ నవలలు మీరూ రాయొచ్చు!' అనే ఈ పుస్తకం దొరకడం, తెలుగుతల్లి పుణ్యఫలం, తెలుగు పాటకుల అదృష్టం అని చెప్పక తప్పదు!



**కనుసన్నల వెన్నెలలో కనిపించే ఆ సాతరంగాల పాటలా...**
**ఫోటో: తాండ్ర కూర్మారావు**

'ప్రేమ నవలలు మీరూ రాయొచ్చు!' అన్న ఈ ఉద్గ్రంథాన్ని గురించి ముందు తెలుసుకుందాం. ఈ పుస్తకాన్ని ఐదు శీర్షికల క్రింద విభజించవచ్చు. 1. హీరోయిన్ 2. హీరో 3. హీరోయిన్ జీవితంలోని మరో మగాడు 4. హీరో జీవితంలోని మరో ఆడది. 5. రచనా విధానం, శైలి, శిల్పం. 6. ఎన్ని పేజీలు?

ఇంతేకాకుండా ఈ ప్రేమా ఎండ్ ప్రేమా సంస్థవారే ఏ సన్నివేశానికి కావల్సిన వర్ణనలు ఆ సన్నివేశానికి—రచయిత్రి తడుముకోకుండా— దొరికే పుస్తకం ఒకటి ప్రచురించారు. వెల పాతిక రూపాయలు. ఉదాహరణకి నవలలోని హీరో, హీరోయిన్లని కాశ్మీరులో ప్రేమలో పడేటట్టు చెయ్యాలని కోరికైతే ఆమెకు ఉందిగాని, గడపదాటి పొరుగూరికన్నా వెళ్ళని రచయిత్రి ఏం వర్ణించగలదూ పాపం? ఆ పుస్తకంలో 'ప్రకృతి వర్ణనలు' అన్న ప్రకరణ తెరుస్తే కాశ్మీరేమిటి?కన్యాకుమారి,గోవా,కోవలమ్— ఒహటనేమిటి ... ఆఖరికి మియామీ బీచ్ గురించీ, ఆల్ప్స్ అందాల వర్ణనలూ అన్నీ దొరికిపోతాయి. మక్కీకి మక్కీ ఎక్కించవచ్చు! అంటే దాన్ని కొద్దిగా ఇటూ అటూ చేసి ఎవరి శైలిలో వాళ్ళు పెట్టుకోవాలనుకోండి.

ప్రేమా ఎండ్ ప్రేమా వారి ప్రేమ నవలలెప్పుడూ థర్డ్ పెర్సన్‌లోనే ఉంటాయి. నేను, నా, మా, లు పనికిరావు. అతడు, ఆమె, వారు అంటూ లడవారి నవలంతా. చిట్కాలు పుస్తకంలో ఆ సలహా స్పష్టంగా ఇవ్వబడి ఉంది. అదయ్యాక అసలు విషయాలకి వద్దాం.

హీరోయిన్ ఎప్పుడూ 19 ఏళ్ళకి తగ్గకుండా, 24 ఏళ్ళకి మించకుండానూ ఉండాలి. ఇంక అందంగా ఉండాలని వేరేగా చెప్పాలా? నాజూకుతనం, అవయవాల పొందిక కలిగుండాలి. ఇంక చీర సింగారించి అలంకరించుకొని డ్రాయింగ్ రూమ్‌లోకి రాగానే చూపరుల కళ్ళు జిగేల్ మనాలి! ఆమె అందం గురించి వివిధ వర్ణనలు ఆ ప్రత్యేక పాతిక రూపాయల గ్రంథంలో దొరుకుతాయి. సందర్భానుసారం —రచయితలు వాడుకోవచ్చు!

ఆమె చిన్నగా చిరునవ్వులు నవ్వగలగాలి. నాయకుడి చూపులు ఆమె మీద పడ్డప్పుడల్లా సిగ్గుపడిపోతూ, అలవోకగా చూడగలగాలి. సిగ్గుపడగానే ముఖం ఎర్రబడిపోతూ ఉండాలి.

మరో అతి ముఖ్యమైన విషయం—ఆమె కన్యే అయితీరాలి! ఏ సందర్భంలోనూ శీలాన్ని కోల్పోకూడదు! కర్మకాలి కోల్పోయినా, హీరో చేతే శీలం కోల్పోయి ఉండాలి!

ఇంక నాయకుడు! నాయిక కన్న నాయకుడు కనీసం ఎనిమిదీ లేక పదేళ్ళు పెద్దవాడై ఉండాలి! ఇంక అతడి కుండవల్సిన లక్షణాలు అనేకం— ఆత్మబలం కలిగినవాడై ఉండాలి. ధైర్య సాహసాలు కలిగినవాడై ఉండాలి. దర్పం, హుందాతనం కలిగినవాడై ఉండాలి. హృదయం నిండా ప్రేమా, సున్నితభావాలూ ఉండగా, కోపమొస్తే నాయికని చెంపపెట్టు పెట్టగల తెంపరితనం ఉండాలి. అప్పుడప్పుడు మూడీగా, మిస్టీరియస్‌గా ఉండాలి — కొన్ని కొన్ని ప్రఖ్యాత నవలలలోని హీరోలని గుర్తు పెట్టుకోమని చిట్కాల పుస్తకం చెప్తుంది. రెబెకా, ప్రైడ్ ఎండ్ ప్రెజుడిస్, ఉదరింగ్ హైట్స్‌లోని హీరోలని గుర్తుకు తెస్తుందా పుస్తకం! తెలుగు సాహిత్యంలో కాస్తే నారాయణరావు, దయానిధి పాత్రలనీ, మరికొన్ని మరికొన్ని పాత్రలనీ గుర్తుంచుకోమంటోంది.

ఇంక అతడి ఎత్తూ, బరువూ, ముఖ కవళికల సంగతి? హీరో పొట్టిగా, పీలగా ఉంటాడా? పనికిరాడండీ! పనికిరాడు! హీరో పొడుగ్గా, తిన్నగా, కండలు తిరిగిన శరీరంతో, పొంగిన ఛాతీతో మదబలం ఉట్టిపడుతూ ఉండాలి!" అని రాయబడి ఉంది పుస్తకంలో. ( చూడుడు పేజీ 48 )

మరి అందం మాట? మగాడికి అందమేమిటంటారా?

"అందంగా ఉండ నౌసరం లేదు! కాని మగసిరి మాత్రం బోల్డంత కలిగుండాలి!"

ఈ విషయంలో ప్రేమా ఎండ్ ప్రేమా వారి పుస్తకం ప్రేమ నవలా రచయితలకు అనౌసరమైన నిర్బంధాలను విధించదు! రచయితకి స్వేచ్ఛనిస్తుంది. హీరో తెల్లగావే ఉండనవసరం లేదు. ఎట్టి రంగులో ఉండొచ్చు, నల్లగానూ ఉండొచ్చు. "నీలమేఘశ్యాముడు" ఇత్యాదిత్యాది వర్ణనలు రాముడి గురించీ, కృష్ణుడి గురించీ చదువుకున్నాం కదా?

"అతడు కట్టుకొనే బట్టలు ఎలాటివయి ఉండాలి? సూట్ వేసుకుంటే వై రంగు, ఎటువంటిదయి ఉండాలి?" అన్న విషయాలు రచయితకే వదిలి పెట్టారు. "జీన్స్ వేయిస్తారో, సూట్ తొడిగిస్తారో, పంజాబీ కుర్తా కట్టింపిస్తారో, పంచా చొక్కా, కండువా ధరింపిస్తారో మీకు తోచినట్టు చెయ్యండి!" అంటున్నారు చిట్కా పుస్తకంలో రచయితలు.

ఇంక తక్కిన పాత్రల దగ్గరికి వద్దాం.

హీరో జీవితంలోని "మరో ఆడది" ఇబ్బంది కలిగించే సమయాల్లో ప్రవేశిస్తూ ఉండాలి. ఉదాహరణకి, మన హీరోయిన్ అప్పుడే నిద్రలేచి నలిగిన సాదా బట్టల్తో వంటింట్లోకి వెళ్ళి ఉంటుంది కాఫీ పెట్టమని వంటావిడకి చెప్పడానికి. అప్పుడు ఈ 'మరో ఆడది' జిగ్‌జిగేల్ మనేలా అలంకరించుకుని వచ్చి, "ఏం అయింది, కిరణ్మయీ! ఒంట్లో నలతగా ఉందా, అలా నీరసంగా కనిపిస్తున్నావు?" అంటుంది. లేదా హీరో, హీరోయిన్‌లు సరదాగా కబుర్లాడుకుంటూ, హీరోయిన్ స్వహస్తాలతో జీడిపప్పువేసి చేసిన ఉప్మాప్లేటు హీరోకిస్తూ ఉండగా, ఈ 'మరో ఆడది' గబుక్కున ప్రవేశించి "ఏమిటే, కిరణ్మయీ! ఉప్పుకషాయం చేసేసేవు ఉప్మా!" అంటూ హీరో చేతిలోని ప్లేటులాగేసి, తను తయారుచేసిన ఉప్మా ప్లేటిస్తుంది!

"కాని ఒకటి గుర్తుంచుకోండి, కాబోయే ప్రేమ నవల రచయితలూ! ఈ మరో ఆడది మాత్రం ఎప్పుడూ, ఎంత ప్రయత్నించినా హీరోయిన్‌ని తోసిరాజని, హీరోని వశంచేసుకో జాలదు! వశం చేసుకుంటే ఆమె 'మరో ఆడది' ఎలా గౌతుంది?"

ఇంక హీరోయిన్ జీవితంలోని 'మరో మగాడి' సంగతికి వద్దాం! ఈ 'మరో మగాడు' ఎప్పుడూ తెరవెనుక నీడలోనే ఉంటాడు. రంగప్రవేశం చెయ్యడు. రంగప్రవేశం చేసి ఎక్కడ ఆమెను అభాసుపాలు చేస్తాడో నన్న భయం పాఠకుల మనస్సులో కలిగిస్తూ ఉండాలి! ఆమె అభమూ శుభమూ తెలీని వయసులో అతడికి ప్రేమ లేఖలు రాసి ఉండొచ్చు. తరవాత అతడి సంకుచితత్వం గ్రహించి అసలు హీరోని ప్రేమించి ఉండొచ్చు. అతగా డామెను బ్లాక్ మెయిల్ చేస్తూ ఉండొచ్చు. కాని అతడూ హీరోయిన్ని ఏమీ చెయ్యలేడు — హీరోకి అప్పుడప్పుడు అనుమానం తగుల్తుంది—"ఎందుకలా ఉన్నావ్? ఏమయింది? ఆ బెదురెందుకు?" అంటూ అడుగుతూ ఉంటాడు. ఆఖరికి సుఖాంతమవుతుంది.

ఇంక తక్కిన పాత్రలు — హీరోకి ఒక ముసలి బామ్మ ఉండొచ్చు. ఆమె అతడి బాగోగులు చూస్తూ ఉంటుంది. ఆమెకీ హీరోయిన్ అంటే ఇష్టం ఏర్పడుతుంది. 'మరో ఆడది' వేసే ఎత్తుల జిత్తులు కనిపెట్టే సమయానికి సాయపడుతూ ఉంటుంది హీరోయిన్‌కి. లేదా అధికారం చెలాయించే పెద్దమ్మ ఉండొచ్చు. హీరోకి తల్లే ఉంటే ఆమె జమీందారిణీ ఫాయాలో ఉండాలి.

నవలలో ఎక్కడా పిల్లలుండరాదు—ముఖ్యంగా అక్రమ సంతానం! ఉంటే వారిని రచయిత చంపేయాలి ఎలాగో వోలా!

'ప్రేమ నవలలు మీరూ రాయొచ్చు' పుస్త

కంలోని పై సలహాలన్నీ పాటించి నవలా వంటకం వండుతే అదెలా ఉంటుంది? ఆ విధంగా వండిన 'నగాలు నవ్వేయి!' నవలని పరిశీలిద్దాం.

దీరజ ఎలా ఉన్నాడుట? "టీవిగా, హుందాగా, మగసిరి ఒలకబోస్తూ" ఉన్నాడు!

"అతడి జుత్తు ఒత్తుగా, నల్లగా, ఉంగరాలు తిరిగి ..." పబ్లిషరు సరఫరా చేసిన పుస్తకం, పేజీ తొమ్మిదిలో హీరో అలా ఉండాలని ఉంది మరి!

ఇంక నవల పదకొండో పేజీలో ...

దీరజ డన్‌హిల్ సిగరెట్ పాకెట్‌తీసి, తాపీగా పెదవుల మధ్య నుంచుకొని, లైటర్‌తో వెలిగించి రింగులుగా పొగ వదుల్తాడు.

"మీరు సిగరెట్ కాలుస్తూ ఉంటే ఎంతో అందంగా కనిపిస్తారు!" ప్రణతి అంది చిరునవ్వులు చిందిస్తూ.

"నువ్వీ చిలకాకు పచ్చరంగు షిఫాన్ చీరలో ఎంత అందంగా ఉన్నావో తెలుసా!" అన్నాడు దీరజ సిగరెట్ పొగ తెర వెనుక నించి ఆమె అందాన్ని కళ్ళతో తాగుతూ—

ఆ మాటలకి ప్రణతి సిగ్గుతో మొగ్గయింది!

మాన్యువల్ ( చిట్కాలు ) లో ఏం రాసుందంటే "హీరోయిన్‌కి సిగ్గూ, బిడియం ఎంతయినా అవసరం. హీరోయిన్‌కి దురభ్యాసాలేవీ ఉండవు. కాఫీ, టీ తాగొచ్చు కాని నిషా పదార్థాల జోలికి పోరాదు ఎట్టి సందర్భంలోనూ, హీరో ఒత్తిడి చేసినా సరే!"


ఇంక నవల ప్లాటు గురించి తెల్సుకుందాం.

నవల సంఘటనలతో చకచకా నడవాలి. ఎంత ఏక్షన్ ఉంటే అంత మంచిది — వర్తమానకాలంలో ఏక్షన్‌కి అవకాశం లేకపోతే, ఫ్లాష్‌బాక్‌లు పెట్టి జరిగిపోయిన కాలంలోకి కథని తీసుకపోండి! ఆమె స్మృతులు ... అతడి స్మృతులు కో కొల్లలు!

'నగాలు నవ్వేయి' లో చూడండి! "ఆ ప్రమాదం సంభవించి పన్నెండు సంవత్సరాలు గడిచి పోయినా, ఆమె మస్తిష్కంలో ప్రతి వివరమూ భద్రంగా ఉంది!" అంటూ పుచ్చకాయల ప్రేమాదేవి మనల్ని ఆ పన్నెండేళ్ళు వెనక్కి ఈడ్చుకుపోయి, యాభై పేజీలు మన మీద కుప్పిస్తుంది! ఇంకా అంతటితో తృప్తిపడక హీరోయిన్ తమ్ముడోడు తయారవుతాడు 75 వ పేజీలో ... అతడికి పోలియో వ్యాధి! చక్రాల కుర్చీలో తిరుగుతూ ఉంటాడు! చిట్కాల పుస్తకంలో రాసుందిగా ..." తమ్ముడు ఉండొచ్చు! ఉంటే అతడికి అంగవైకల్యం కల్పించుము!"

ఇంక పాత్రల ముఖ కవళికల ప్రస్తావన—

"నగాలు అగపడగానే దీరజ స్టీరింగ్ మీద వేళ్ళని గట్టిగా బిగించేడు!" అంటోంది రచయిత్రి. బిగించడూ మరి? కారుని అరవై మైళ్ళ వేగాన నడుపుతున్నాడే! 41 పేజీలో కాని ఏసిడెంట్ జరగదాయె! ఇప్పుడింకా పదో పేజీలో కథ ఉందాయెం "ఆ నగాలని చూడగానే దీరజకి ఎంతో ఉత్సాహం కలిగింది! శిఖరాల మీది మంచు కిరీటంలా ఉంది!" అంటగా ... "ఇంద్రుడు వజ్రాయుధం ధరించ నట్లు!" అంటూ వో ఉపమానాలంకారం. మంచు కిరీటానికీ, వజ్రాయుధానికీ సంబంధ మేమి ? అని




పాఠకులు విస్తుబోదురు — వజ్రాయుధం ఇంద్రుడి కిరీటం అనుకున్న పాఠకులూ ఉందురు— రచయిత్రీ ఆ పొరపాటు పడి ఉండొచ్చు!

ఇంక పాత్రల ముఖ కవళికలు ఎప్పుడూ స్థిరంగా ఉండవు. దేవాలయంలోని మర్రిచెట్టుకి వ్రేలాడే గబ్బిలాలు వ్రేలాడుతూనే కదులుతున్నట్టు కదులు తూనే ఉంటాయి. "దీరజ పెదవులు విశాలంగా నవ్వుని పరచుకున్నాయి" "అతడి దవడలు గాఢ నిశ్చయంతో బిగుసుకున్నాయి" "అతడు కళ్ళు చిట్లించేడు సాలోచనగా!" "నర్మ గర్భంగా వో చిరునవ్వు అతడి పెదాల మీద వంకరలు తిరిగింది!", "ప్రణతి ముఖంలో సిగ్గు దొంతరలు కమ్ము కున్నాయి.ముఖం కందగడ్డయింది, దీరజ అలా చూడగానే" "ఆమె చిన్నగా నవ్వి, పెద్దగా కూజితం చేసింది కోయిలలా తన్మయత్వంతో!" ఇటువంటి హావభావ వివరణలు 'నగాలు నవ్వేయి' లో కో కొల్లలు!

ఇంకా మరికొన్ని ముఖ కవళికలు — భ్రుకుటిని ముడిచి సంకేతా లివ్వడం, కళ్ళతో సంభాషణ నడపడం "అతడు ఎడమ కనుబొమ్మ ఎత్తి, కుడి కన్నుతో నవ్వి అన్నాడు"—"ఆమె ఒక కనుబొమని ధనస్సులా వంచి, మూతిని సున్నాలా చుట్టి ..." "ఇద్దరూ కళ్ళతో సంభాషించుకున్నారు. అతడి కళ్ళన్నాయి .. 'నే నంటే నీ కిష్టమేనా, ప్రణతీ!' ఆమె కళ్ళు జవాబిచ్చేయి ... ఇష్టమా ... ఇష్టమున్నరా! పలకోవాకంటే ఇష్టం దీరజ!" "ఆమె పెదవులు బిగించి, ముందున్న బడ వెనక్కి పడేలా తల ఎగరేసి విసురుగా నడిచింది!" ఇవీ మచ్చుకి కొన్ని ఆ నవలలో!

ఇంక ప్రేమ సన్నివేశాలు పరిశీలిద్దాం—

"అతడి చూపు లామె హృదయపు లోతులకోసం వెతికేయి!" "అతడి పెదవు లామె అధరాల మధువు కోసం మధుపంలా మథనపడ్డాయి!"

చిట్కాల పుస్తకం ఏమంటోంది! "నాయికా నాయకులు ముద్దుపెట్టుకోవచ్చు, ఫరవాలేదు— ఇంకా పెళ్ళికాకుండా అంతకుమించి హద్దుమీర కూడదు. కౌగిలింతలా? మరి కౌగలించుకోందే ముద్దెలా పెట్టుకుంటాడు? అది కూడా మేం మీ్మకు చెప్పాలా? పెళ్ళి ఐపోతేనా ... ఇంక ఏ అడ్డూ లేదు. ముద్దుల పరిహద్దు దాటి ముందుకు పోవచ్చు రచయిత. అవసరం పడితే వారి రాసలీలలను వర్ణించవచ్చు. నగ్నత్వం గురించి రాయొచ్చు. ఇంక ప్రేమ జరుపు తున్నప్పుడు, 'ఆమెని దగ్గరికి తీసు కున్నాడు. ముద్దుపెట్టుకున్నాడు. ఇద్దరూ మంచం వేపు నడిచేరు' అంటే పనికిరాదు. ఒకర్నొకరు శారీరకంగా ప్రేమించుకొనే ఘట్టాలు పసందుగా రాయగలగాలి. అందులో కాముకలే కాకుండా రొమాన్స్ కూడా చూపించాలి. నవల చదువుతున్నంత కాలం పాఠకులు హీరో నెంతగా ప్రేమిస్తారో, హీరోయిన్న అంతగానే ప్రేమించ గలగాలి!"

"కాలకృత్యాలు తీర్చుకున్నాడు" "కాలకృత్యాలు తీర్చుకుంది" అన్న పదాలు హీరో హీరోయిన్ల మీద వాడకూడదు అంటుంది చిట్కాల పుస్తకం. రొమేంటిక్ ఇమేజ మంట కలుస్తుంది! బాత్‌రూమ్ కంపుకొడతాయి పాత్రలు!

కథకి ప్లాటు ఏం తీసుకోడం? ఎలా ప్రారంభించడం?

ప్రతి నవలా ఒక అనుకోని, మహత్తర సన్ని వేశంతోకాని, ఒక మలుపు తిప్పే సంఘటనతోకాని, ఎడ్వెంచర్‌తోకాని, ప్రారంభం కావాలి. పాఠకుల జుత్తు దొరక పుచ్చుకోవాలి రచయిత, తరవాత తాపీగా వారిని బోరొచ్చు! తప్పించుకపోలేరు!

మరోసంగతి, ఆఖరి పేజీ వరకూ హీరో నిజంగా తనని ప్రేమిస్తున్నాడని హీరోయిన్‌కి నమ్మకం కుదరదు. పాఠకులకీ ఆ సస్పెన్స్ ఉండడం మంచిది. కథ సాధారణంగా నాయికా నాయకుల మధ్య సంఘర్షణతో ప్రారంభమైతే ఉత్తమం! ఇద్దరి మధ్యా ఆకర్షణ, వికర్షణ, ప్రేమ, ద్వేషం, పొరపొచ్చాలు, తప్పుగా అర్థం చేసుకోవడాలు ఎన్నయినా సన్నివేశాలు సృష్టించవచ్చు మీ వోపికా, పాఠకుల వోపికా!

ఆఖరుపేజీ, ఆఖరు పేరాలో "ప్రణతీ! మన ప్రేమ ఆ నగాల్లా అచలమైనది, స్థిరమైనది!" అంటాడు, ప్రణతిని దగ్గరకు తీసుకుని. "దీరజ! ఇంతకాలం ఒకర్నొకరం అర్థం చేసుకోక జాప్యం చేసికొన్నందుకు నగాలు నవ్వుతున్నాయి' అంటూ అతడి విశాల హృదయం మీ్మద సేదదేరుతుంది! అంతటితో పాఠకులకీ, 'నగాలు నవ్వేయి' నవలా రచయిత్రికీ, అప్పటికి రుణం తీరుతుంది!

నవలని చదివేసేక పాఠకుడ్ని వదిలి చెత్త బుట్టతో ప్రణయానికి దిగుతుం దా నవల. పాఠకుడూ, పాఠకురాలు ఇంటి ముఖం పడతారు ఆఫీసునించి తీవ్రంగా ఆలోచిస్తూ "ఇదే ప్రేమైతే నాకూ, నా ప్రియుడు (రాలి) కీ మధ్య ప్రేమ చెత్త బుట్టపాలే!" అనుకుంటూ!

అయ్యో ఆఖరు సంగతి మరిచేం! నవల నిడివెంత ఉండాలి? అది రచయిత పాప్యులారిటీ మీద, పబ్లిషరు—పత్రికకు మీ మీద వెచ్చించ దలచుకున్న తెల్లకాగితం—డబ్బు మీద, పాఠకుల వోపికమీద ఆధారపడి ఉంటుంది. ఒక చిన్న కథని వెయ్యి పేజీల నవలగా సాగదియ్యొచ్చు, వెయ్యి పేజీల నవలా ప్లాటుని ఒక కథానిక లోనూ ఇరికించొచ్చు. మీకూ, మీ ఎడిటర్‌కీ, మీ పాఠకులకీ మధ్య నెలకొన్న అవినాభావ సంబంధంమీ్మద ఆధారపడి ఉంటుందది! గుడ్‌బై! బెస్ట్ ఆఫ్ లక్! !

( 'పంచ్' లోని ఒక ఆంగ్ల రచనకు స్వేచ్ఛాను కరణ. ) *